# ఉప్పల్ స్టేడియానికి అత్యుత్తమ పిచ్, గ్రౌండ్ అవార్డు..

## -రూ.50 లక్షల నగదు బహుమతి

హైదరాబాద్ మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: ఐపిఎల్-17వ సీజన్ అత్యుత్తమ పిచ్, గ్రౌండ్ అవార్డు ఉప్పల్ స్టేడియాన్ని వరించింది. ఆదివారం చెన్నైలో జరిగిన ఐపిఎల్ ముగింపు వేడుకల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్మోహన్ రావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు హెచ్‌సిఎకు రూ.50 లక్షల నగదు బహుమతిని కూడా ఐపిఎల్ నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రావు మాట్లాడుతూ ఐపిఎల్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు కార్యదర్శి దేవ్‌రాజ్‌తో పాటు ఇతర అపెక్స్ కౌన్సిల్ సభ్యులు, హెచ్‌సిఎ సిబ్బంది అహర్నిశలు శ్రమించారని, ముఖ్యంగా చీఫ్ క్యురేటర్ చంద్రశేఖర్, ఇతర గ్రౌండ్‌మన్ సిబ్బంది అద్భుతంగా పనిచేశారు' అని కితాబు ఇచ్చారు. ఈ అవార్డు హెచ్‌సిఎ కుటుంబ సభ్యులందరీ కష్టానికి ప్రతిఫలమని జగన్మోహన్ రావు అన్నారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com


### చురక

ప్రభుత్వం ఎవరిదైనా
ఫోన్ ట్యాపింగ్ నేరం
పాలకులకు ఏ శిక్ష లు
పడకుంటే మరి ఘోరం.

బాధ్యులైనా అధినేతలు
బలిపశులు అధికారులె
చట్టపరిధి ప్రాపు కొరకు
జవదాటితే అపచారులె

-వేల్పుల
నారాయణ


హైదరాబాద్ బుధవారం 29-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:232 పేజీలు:6 వెల: రూ.1/-


# అయోధ్య రాముడికి తెలంగాణా వస్త్రాలు

### -వారం రోజుల పాటు రోజుకో రంగుతో తయారైన వస్త్రాన్ని శ్రీరాముడికి అలంకరణ

దుబ్బాక మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: సిద్దిపేట జిల్లా దుబ్బాక చేనేత వస్త్ర ఖ్యాతి దేశం నలుమూలల విస్తరించింది. నూతన వస్త్ర డిజైన్లకు అనుగుణంగా తయారుచేస్తూ ప్రశంసలు దుబ్బాక చేనేత కార్మికులు పొందుతున్నారు. సాక్షాత్తు అయోధ్య శ్రీరామచంద్రుడే దుబ్బాక చేనేత వస్త్రాన్ని ధరించి మరింత ఖ్యాతిని విస్తరింపజేశాడు. వారం రోజుల పాటు రోజుకో రంగుతో తయారైన వస్త్రాన్ని శ్రీరాముడికి అలంకరించేందుకు అర్డర్‌ను అందుకున్నారు. దుబ్బాకలో ఏర్పాటైన దుబ్బాక హైండ్లూమ్స్ కంపెనీలో తయారైన లినెన్ ఇక్కత్ చేనేత వస్త్రాన్ని (పింక్ కలర్) అయోధ్య రాముడికి ఆదివారం అలంకరించారని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బోడ శ్రీనివాస్ తెలిపారు. అయోధ్య రాముడి అలంకరణకు తాము తయారు చేస్తున్న లినెన్ వస్త్రాలు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి సోమవారం నుంచి ఆదివారం వరకు వివిధ రంగులతో తయారు చేసిన వస్త్రాలను రాముడికి అలంకరించేందుకు ఢిల్లీకి చెందిన డిజైనర్ మనీశ్‌త్రిపాఠి ఎంపిక చేస్తారని ఈ క్రమంలో దుబ్బాకలో తయారైన లినెన్ చేనేత వస్త్రం డిజైన్లు నచ్చి తమ కంపెనీకి అర్డర్ ఇచ్చారని శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం రెండు రంగులతో కూడిన రెండు డిజైన్ లినెన్ ఇక్కత్ వస్త్రాలను అందించడం జరిగిందన్నారు. ప్రతి వస్త్రం 12 మీటర్ల పొడవు ఉంటుందన్నారు. శ్రీరాముడికి ఆదివారం పింక్ కలర్ వస్త్రాన్ని అలంకరణ చేసే నిబంధన ఉండటంతో తాము తయారు చేసిన వస్త్రాన్ని అలంకరించినట్లు డిజైనర్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు సమాచారం అందించారన్నారు. మరో ఐదు రోజులకు ఐదు డిజైన్లతో కూడిన వస్త్రాలను తయారు చేసి అందజేయనున్నట్లు చైర్మన్ బోడ శ్రీనివాస్ తెలిపారు. గత ఫిబ్రవరిలో ఢిల్లీలో జాతీయ స్థాయిలో కేంద్ర చేనేత, జౌళీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విరాసత్ పేరిట చేనేత చీరల ప్రదర్శనలో దుబ్బాకలో తయారైన లినెన్ చీరకు స్థానం దక్కి దుబ్బాక చేనేత కార్మికులు ప్రశంసలు పొందారు.

# రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణం ఉండదు

### -ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణం ఉండదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమ్మక్క - సారక్క, నాగోబా జాతర స్ఫూర్తికి అద్దం పట్టేలా చిహ్నం ఉంటుందన్నారు. పోరాటాలు, త్యాగాలకు ప్రతిబింబంగా అధికారిక చిహ్నం ఉంటుందని సీఎం పేర్కొన్నారు. ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ గేయానికి సంగీతం సమకూర్చడం సహా మొత్తం వ్యవహారాన్ని అందెశ్రీకే అప్పగించాం అని రేవంత్ రెడ్డి తెలిపారు. అందెశ్రీనే కీరవాణిని ఎంపిక చేశారు. కీరవాణి వ్యవహారంతో నాకు సంబంధం లేదు. ఎవరితో సంగీతం చేయించువాలనేది అందెశ్రీ నిర్ణయానికే వదిలేశాను అని పేర్కొన్నారు.

# ఎస్ఐబీ కార్యాలయంలో కొన్ని వస్తువులు మిస్...

### ఈ క్రమంలోనే బయటికి వచ్చిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం:సిఎం రేవంత్ రెడ్డి

న్యూ ఢిల్లీ మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ 0;ఫోన్ ట్యాపింగ్పైనా సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అధికార మార్పిడి తర్వాత చోటు చేసుకున్న అధికారుల బదిలీల్లో ఎస్ఐబీ కార్యాలయంలో కొన్ని వస్తువులు మిస్ అయినట్లు గుర్తించారని, ఈ క్రమంలోనే ట్యాపింగ్ వ్యవహారం బయటికి వచ్చిందని తెలిపారు. ట్యాపింగ్ వ్యవహారంపై ఇప్పటి వరకు సమీక్ష జరపలేదన్న రేవంత్ రెడ్డి, అధికారులు వారి పని వారు చేసుకుంటూ పోతున్నారని చెప్పారు. పోలీసుల పనిలో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో తనకు తెలుసునన్నారు. అన్నింటికీ సీబీఐ విచారణ కోరే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు, ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు కోరడం లేదని సీఎం ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి కార్యకలాపాలు తమ ప్రభుత్వం చేయదని ముఖ్యమంత్రి చెప్పారు. తీవ్రవాదులు, జాతి వ్యతిరేక శక్తుల విషయంలో ఫోన్ ట్యాపింగ్ జరగొచ్చని, అందుకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే ఎస్ఐబీ అధికారులు కేంద్ర నిఘా సంస్థలతోనే నేరుగా మాట్లాడతారు తప్ప, తనతో కాదన్నారు. 1980, 90ల నుంచి సేకరించిన డేటా అంతా ఉందో లేదో? బ్యాకప్ కూడా ఉందో లేదా దాన్ని కూడా మాయం చేశారో అంతా దర్యాప్తు అధికారులకు తెలుస్తుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామన్నారు.

# సోనియాతో రేవంత్ భేటి.. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు వస్తానని హామీ

న్యూఢిల్లీ, మే 28 :తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతోన్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న దశాబ్ది ఉత్సవాలకు రావాలని సోనియాగాంధీని ఆయన కోరారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ప్రత్యేకంగా సోనియా గాంధీతో భేటీ అయ్యారు. సోనియాతో భేటీ ముగిసిన అనంతరం



రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఆమెను చీఫ్ గెస్ట్ గా పిలవాలని ఇప్పటికే తెలంగాణ కేబినెట్ తీర్మానించిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడంపై సోనియా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేసిన ఉద్యమకారులను, అమరుల కుటుంబాలను ఈ వేడుకలకు ఆహ్వానిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణలో పరిపాలన రాయిలాగా మారింది

### -రాజముద్రలో కాకతీయ తోరణం, చార్మినార్ ఉంటే అది రాచరిక పోకడనా!

### -సిఎం రేవంత్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): : ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ కళాతోరణం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలాగా మారింది అని కేటీఆర్ విమర్శించారు. ప్రముఖ కళాకా రుడు అలె లక్ష్మణ్ తయారు చేసిన రాష్ట్ర రాజముద్రలో తెలంగాణ చరిత్రకి, సాంస్కృతిక వారసత్వానికి, గంగా- జమునా తెహజీబ్‌కి ప్రతీకలైన కాకతీయ తోరణం, చార్మి నార్ ఉంటే అది రాచరిక పోకడనట అని కేటీఆర్ మండి పడ్డారు. కానీ రాష్ట్ర గీతంలో మాత్రం అదే చార్మినార్ గురించి "గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్" అని పాడుకోవాలి. "కాకతీయ కళాప్ర భల కాంతిరేఖ రామప్ప" అని అదే రాచరిక పరిపాలన గురించి ప్రస్తుతించాలి. అసలు ముఖ్యమంత్రికి గాని, ఆయన మంత్రిమండలిలో ఒక్కరికైనా రాష్ట్రగీతంలో ఏమున్నదో తెలుసా.. అని కేటీఆర్ నిలదీశారు.

# సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ శైలి అజరామరం.. పవన్

అమరావతి, మే 27 :సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ శైలి అజరామరమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొనియాడారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.

'తెలుగు నుడికారానికి, తెలుగు నేలకు, తెలుగు జాతికి మరింత సొబగులు అద్దినవారిలో మన ఎన్టీఆర్ ఒకరని తెలుగువారు గర్వంగా చెప్పుకోవచ్చు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతి సందర్భంగా అంజలి ఘటిస్తున్నాను. ఎన్టీఆర్ తెచ్చిన సంస్కరణలు, రూ.2కే కిలో బియ్యం చిరస్థాయిగా నిలిచిపోయాయి" అని పవన్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# కేరళలో ఘోరం.. మహిళను బలితీసుకున్న బిర్యానీ..!

న్యూఢిల్లీ, మే 28 : కేరళలో ఘోరం జరిగింది. ఇష్టంగా తిన్న బిర్యానీ ఓ మహిళ ప్రాణాలు తీసింది. త్రిసూర్ జిల్లాలోని పెరింజనం పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక రెస్టారెంట్‌లో బిర్యానీ తిన్న సుమారు 178 మందికి ఫుడ్ పాయిజనింగ్ అయ్యింది. వారిలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. కుటిలక్కడవ్‌కి చెందిన నుసైబా (56) బిర్యానీ తిన్న తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆమెను స్థానికంగా ఉన్న ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి ఇరింజలకుడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆ తర్వాత మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ నుసైబా మంగళవారం మరణించారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మరణానికి కారణాలపై శాస్త్రీయ పరిశోధన జరగనుంది. ఫుడ్ పాయిజన్ ??అయిందన్న అనుమానంతో పోలీసులు, ఆరోగ్య శాఖ అధికారులు, ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, పంచాయతీ అధికారులు, పోలీసులతో కలిసి రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటనపై స్థానిక అధికారులు స్పందించి రెస్టారెంట్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అపరిశుభ్రతతో హోటల్ నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. ఈ విషయంపై కయపమంగళం పోలీస్‌స్టేషన్, పెరింజనం పట్టణ పంచాయతీలో ఫిర్యాదు చేశారు. ఫుడ్ పాయిజనింగ్ కారణంగా ఆస్పత్రిలో చేరిన వారిని కలుసుకుని సమాచారాన్ని సేకరించారు. రెస్టారెంట్‌లోని మయోనీస్, కేరళలో ప్రసిద్ధి చెందిన బిర్యానీ లాంటి యెమెన్ వంటకం 'కుజి మండి' తినడంవల్లే మహిళ మరణించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది పెరింజనం, కయపమంగళానికి చెందినవారే.

కేరళ ప్రభుత్వం ఫుడ్ పాయిజనింగ్ కేసుల కారణంగా 2023 జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా రెస్టారెంట్లలో గుడ్లతో తయారు చేసిన మయోనీస్‌ను నిషేధించింది. అప్పట్లో కాసర్‌గోడ్‌కు చెందిన అంజు శ్రీపార్వతి అనే 20 ఏళ్ల యువతి రెస్టారెంట్‌లో మండి తిని మరణించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు పెరింజనంలో తాజా ఘటన చోటుచేసుకుంది.

# 30 నుంచి కన్యాకుమారిలో ప్రధాని పర్యటన.. ధ్యానం చేయనున్న మోదీ

న్యూఢిల్లీ, మే 28 : ఈ నెల 30న లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ కన్యాకుమారిలో పర్యటించనున్నారు. స్వామి వివేకానంద స్మారకార్థం నిర్మించిన రాక్ మెమోరియల్ వద్ద ధ్యానం చేయనున్నారు. గతంలో స్వామి వివేకానంద ధ్యానం చేసిన ప్రాంతంలోనే ప్రధాని మోదీ కూడా ధ్యానం చేయనున్నారు. 30వ తేదీ నుంచి జూన్ ఒకటిన సాయంత్రం వరకు ఆయన ధ్యాన్య మండపంలో ధ్యానం చేస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి.

2019 ఎన్నికల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ కేదార్‌నాథ్ గుహలో ధ్యానం చేసిన విషయం తెలిసిందే. కన్యాకుమారిని తన ఆధ్యాత్మిక విహారానికి వేదికగా ఎంచుకున్న ప్రధాని మోదీ నిర్ణయం దేశంపై వివేకానందుడి దార్శనికతను సాకారం చేయడంలో ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తుందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. పార్లమెంట్ ఎన్నికల తుది దశ పోలింగ్ జూన్ ఒకటి జరుగనున్నది. ఎన్నికలకు రెండురోజుల ముందు ప్రచారం ముగియనున్నది. ఇప్పటికే ఆరు దశల పోలింగ్ పూర్తయ్యింది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# ఈడీ, సీబీఐలతో విపక్ష నేతలను వెంటాడుతున్న మోదీ సర్కార్ : కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 28 : విపక్ష నేతలను ఈడీ, సీబీఐలతో కాషాయ పాలకులు వెంటాడుతున్నారని కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్ధులను దర్యాప్తు ఏజెన్సీలతో టార్గెట్ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై అవే ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు.

మీరు ఏ విపక్ష నేతనైనా విడిచిపెట్టారా అని రషీద్ అల్వీ కాషాయ పాలకులను నిలదీశారు. ప్రతిఒక్క విపక్ష నేతపై ఈడీ, సీబీఐలను ప్రయోగించారని, ఏ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగినా ఈడీ, సీబీఐ చురుకుగా మారతాయని అన్నారు. ఇలా గతంలో ఎన్నడూ జరగలేదని చెప్పారు.

బీజేపీ ఆరోపణలు గుప్పించిన రాజకీయ నేతలు కాషాయ పార్టీలో చేరిన వెంటనే పవిత్రులు అవుతారని ఎద్దేవా చేశారు. బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని రషీద్ అల్వీ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ పార్టీకి భంగపాటు తప్పదని అన్నారు.

# మరో మహమ్మారిని ఎదుర్కోక తప్పదు..! హెచ్చరించిన బ్రిటన్ ప్రభుత్వ మాజీ సలహాదారు

న్యూఢిల్లీ, మే 28 :కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తూనే ఉన్నది. కొత్త కొత్త రూపాలను మార్చుకుంటూ పంజా విసురుతున్నది. మొన్నటి వరకు శాంతించిన వైరస్ మళ్లీ జడలువిప్పుతున్నది. ఇటీవల సింగపూర్ సహా పలు దేశాల్లో కేసులు పెరగడం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలోనే బ్రిటన్ ప్రభుత్వ మాజీ ప్రధాన సలహాదారు సర్ పాట్రిక్ వాలెన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరోనా తరహా మరో సంక్షోభాన్ని మానవాళి ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

కరోనావైరస్ మహమ్మారి భయంకరమైన అనుభవాల నుంచి ప్రపంచం బయటపడిందని.. అదే తరహా సంక్షోభం ఎదుర్కోవడం 'ఖచ్చితంగా అనివార్యం' అన్నారు. ఈ దిశలో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన ప్రపంచదేశాలకు పిలుపునిచ్చారు. సంక్షోభం ఎదురైన సమయంలో తక్షణమే స్పందించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. అవసరమైన స్థాయిలో వైద్య పరీక్షల నిర్వహణ సామర్థ్యం, టీకాలు, చికిత్సలు అన్ని అందుబాటులో ఉంచుకోవాలని.. దాంతో లాక్‌డౌన్, సోషల్ డిస్టెన్స్ తదితర వంటి కఠిన చర్యలు అవసరం ఉండబోదన్నారు.

2021లో తాను చేసిన సూచలన్నీ 2023 నాటికి అనేక దేశాలు మరచిపోయాయన్నారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. సైనిక అవసరాల విషయంలో ఎలా అప్రమత్తమై ఉంటామో.. సంక్షోభం కట్టడి చర్యలకు సైతం అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనన్నారు. యుద్ధంతో నిమిత్తం లేకుండా ఆర్మీ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లుగానే సంక్షోభ నివారణ వ్యవస్థలపై దృష్టి పెట్టాలని సూచించారు. సంక్షోభ సమయంలో వివిధ దేశాలు కలిసికట్టు చర్యలు తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ చొరవ తీసుకోవాలని పాట్రిక్ వాలెన్స్ పిలుపునిచ్చారు.

# ఒక్కరోజే భారీగా పెరిగిన సిల్వర్.. అదే బాటలో బంగారం .. !



న్యూఢిల్లీ, మే 28 : అంతర్జాతీయ మార్కెట్లలో ట్రెండ్‌కనుగుణంగా దేశీయ బులియన్ మార్కెట్లో మంగళవారం వెండి ధర భారీగా పెరిగింది. అదే బాటలో బంగారం ప్రయాణిస్తున్నది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ఒక్కరోజే రూ.3,100 పెరిగి రూ.95,950 పలికింది. మరోవైపు పది గ్రాముల బంగారం (24 క్యారట్స్) ధర రూ.130 పెరిగింది.

'వరుసగా రెండో రోజు మంగళవారం కిలో వెండి ధర రూ.3100 పెరిగి, రెండు వారాల గరిష్ట స్థాయికి చేరువలో రూ.95,950 పలికింది. సోమవారం కిలో వెండి ధర రూ.92,850 వద్ద నిలిచింది. మరోవైపు పది గ్రాముల బంగారం (24 క్యారట్లు) ధర రూ.130 లబ్ధితో రూ.72,950 వద్ద ముగిసింది. సోమవారం సెషన్‌లో తులం బంగారం ధర రూ.72,820 వద్ద స్థిర పడింది. అంతర్జాతీయ మార్కెట్లలో కామెక్స్ స్పాట్ గోల్డ్ ఔన్స్ ధర రెండు డాలర్లు పుంజుకుని 2346 డాలర్లకు చేరుకున్నది. యూఎస్ డాలర్ బలహీన పడటంతో యూరోపియన్ ట్రేడింగ్ సమయంలో బంగారం స్వల్పంగా పుంజుకున్నది. అమెరికా ద్రవ్యోల్బణం గణాంకాల కోసం ఇన్వెస్టర్లు వేచి చూస్తున్నారు. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలకు అనుగుణంగా యూఎస్ ఫెడ్ రిజర్వ్ ఎప్పుడు వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న సంగతి తెలుస్తుంది. దాన్ని బట్టే ముమ్మందు బంగారం ధరలు ఆధార పడి ఉంటాయి' అని హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్స్ వెండి ధర 31.50 డాలర్లు పలికింది. అంతర్జాతీయంగా ఔన్స్ వెండి ధర 31 డాలర్ల మార్కును దాటేస్తుందని బులియన్ మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో తులం బంగారం ధర రూ.169 తగ్గి రూ.71,840 వద్ద స్థిర పడింది. జూన్ కాంట్రాక్ట్ బంగారం ధర ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూ.71,762లతో కనిష్ట స్థాయిలో ట్రేడింగ్ అయింది. మరోవైపు జూలై డెలివరీ కిలో వెండి కాంట్రాక్ట్ ధర రూ.294 తగ్గి రూ.94,314 వద్ద నిలిచింది.

# ఆదిలాబాద్‌లో రైతన్నలపైన లాఠీచార్జి.. తీవ్రంగా ఖండించిన కేటీఆర్

హైదరాబాద్, మే 28 :ఆదిలాబాద్‌లో రైతన్నలపైన లాఠీచార్జిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రైతన్నలపైన దాడి చేసిన ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో రైతన్నలపైన దాడులు జరుగుతుంటే ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం, ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉండడం సిగ్గుచేటు అని కేటీఆర్ మండిపడ్డారు.

రాజకీయాలు పక్కన పెట్టి రైతన్నల సమస్యలను పట్టించుకోవాలని ముఖ్యమంత్రికి కేటీఆర్ సూచించారు. ఐదు నెలల్లోనే రాష్ట్రం వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోవడం ముమ్మాటికి ప్రభుత్వ పరిపాలన వైఫల్యమే. రాష్ట్రంలో రైతన్నల సమస్యలపైన ముఖ్యమంత్రి వెంటనే ఒక ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించాలి. రైతన్నల పైన లాఠీ చార్జ్ చేసిన అధికారులపైన కేసులు నమోదు చేసి, చర్యలు తీసు కోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రైతన్నలపైన ప్రభుత్వ దాడులు ఇలానే కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని కేటీ ఆర్ హెచ్చరించారు. విత్తనాల కోసం బారులు తీరిన రైతన్నలపై లాఠీచార్జ్ అత్యంత దారుణం అన్న కేటీఆర్, ఇది రైతన్నలపైన ప్రభుత్వ దాడి అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లో రాష్ట్ర వ్యవసాయాలను ముఖ్యంగా రైతన్నల పరిస్థితి పూర్తిగా దిగజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతన్నలకు కావాల్సిన సాగు నీటి నుంచి మొదలుకొని, రైతుబంధు పెట్టుబడి సహాయం వరకు, చివరికి కనీసం విత్తనాలు అందించలేని దుర్మార్గపూరిత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు.




# ఆరో దశ లోక్‌సభ ఎన్నికలలో 63.37శాతం పోలింగ్..

న్యూఢిల్లీ, మే 28 : లోక్‌సభ ఎన్నికల ఆరో దశ పోలింగ్ తుది గణాంకాలను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆరో దశలో 63.37శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించింది. 61.95శాతం పురుషులు, 64,95శాతం మహిళలు, 16.67 శాతం మంది థర్డ్ జెండర్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పింది. లోక్‌సభ ఎన్నికలు ఈ నెల 25న ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 58 స్థానాలకు ఓటింగ్ జరిగింది. ఇందులో జమ్మూఅండ్ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ పార్లమెంటరీ నియోజకవర్గం సైతం ఉన్నది. ఇక్కడ ఓటింగ్ ఆరో దశకు వాయిదా వేసింది.

వాస్తవానికి ఇక్కడ మూడో దశలో ఎన్నికలు జరిగాల్సి ఉంది. ఆరో దశలో కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ, మనోజ్‌తివారీ, నిర్హువా, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, మాజీ సీఎం మనోహర్‌లాల్ కట్టర్‌తో సహా పలువురు కేంద్రమంత్రుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఆరో దశలో ఓటింగ్ జరిగిన స్థానాల్లో ఉత్తరప్రదేశ్‌లోని 14 సీట్లు, హర్యానాలోని 10 సీట్లు, బీహార్‌లో ఎనిమిది, పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది సీట్లు, ఢిల్లీలోని ఏడు సీట్లు, ఒడిశాలోని ఆరు సీట్లు, జార్ఖండ్‌లోని నాలుగు లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది.

### చురక

భ్రాంతిని తొలగించి -చెలగు
కాంతులు కలిగించు సైనికావళి నెల్లన్
స్వాంతనమున తలపోసెద
శాంతిని కాపాడునట్టి సైన్య దినమునన్
(మే 29 ప్రపంచ శాంతిరక్షక దళాల దినోత్సవం..)



-వేల్పుల నారాయణ
9440433475

# పర్వతారోహణ సాహస క్రీడ పట్ల యువతకు అవగాహన !

**(29 మే 'అంతర్జాతీయ ఎవరెస్ట్ దినం' సందర్భంగా)**

29 మే 1953న న్యూజీలాండ్‌కు చెందిన 'సర్ ఎడ్మండ్ హిల్లరీ', నేపాల్‌కు చెందిన 'టెన్సింగ్ నార్గే షెర్పా' ద్వయం తొలిసారి అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ పర్వాతాన్ని అధిరోహించి పర్వతారోహణ క్రీడా ప్రపంచ చరిత్రలో రికార్డు సృష్టించారు. 2008లో ప్రఖ్యాత పర్వతారోహకులు ఎడ్మండ్ హిల్లరీ తుది శ్వాస విడిచిన వేళ ఈ చారిత్రాత్మక ఘటనకు గుర్తుగా 29 మే 2008 నుంచి నేపాల్ ప్రభుత్వం 'అంతర్జాతీయ ఎవరెస్ట్ దినం' జరుపు కోవడం ఆనవాయితీగా మారడం హర్షదాయకం. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్టు పర్వతం సముద్ర మట్టానికి 8,848.86 మీటర్ల (29,031.7 అడుగులు) ఎత్తున ఉన్నది. మౌంట్ ఎవరెస్టు పర్వతాన్ని నేపాలీలు 'సగరమతా' అని, అలాగే టిబెటన్లు 'చోమోలున్గమా' పర్వతమని పిలుస్తారు. 1830 - 43 మధ్య తొలిసారి సర్వే చేసిన భారత సర్వేయర్ జనరల్ 'సర్ జార్జ్ ఎవరెస్ట్' ఈ పర్వతాన్ని గుర్తించారు. వారి స్మారకార్థం ఈ పర్వతానికి 'ఎవరెస్ట్' అని నామకరణం చేశారు. అంతర్జాతీయ ఎవరెస్ట్ దినం వేదికగా పర్వతారోహకులు, ఔత్సాహిక పర్యాటక సంస్థలు పర్వతారోహణ క్రీడ పట్ల అవగాహన కల్పిస్తూ సదస్సులు, కార్యశాలలు, ప్రదర్శనలు, ఆసక్తికర పోటీలు నిర్వహిస్తారు.

పర్వతారోహణ సాహస క్రీడ ప్రమాదకరం:

హిమాలయాల్లోని 'మహాలంగూర్ హిమల్' సబ్-రేంజ్‌లో అత్యంత ఎత్తైన ఎవరెస్టు పర్వతం చైనా-నేపాల్ సరిహద్దుల్లో ఉన్నది. ఎవరెస్ట్ పర్వతారోహణలో ప్రతికూల వాతావరణం, బలమైన గాలులు, అవలాంచ్‌ల ప్రమాదాలు, అల్టిట్యూడ్ సిక్‌నెస్, మంచు చెరియలు విరిగి పడడం లాంటి ప్రాణాంతక ప్రమాదాలు ఉంటాయి. 2019 గణాంకాల ప్రకారం 306కు పైగా ఎవరెస్ట్ పర్వతారోహకులు అధిరోహించాలనే ప్రయత్నాలలో ప్రాణాలు విడవడం, అలాంటి సాహసికుల పార్థివ దేహాలు ఆ మంచు కొండల్లోనే కలవడం జరిగింది. ఆక్సిజన్ బాటిల్ వెంట ఉన్నప్పటికీ పర్వతారోహకులు వాంతులు, అలసట, వికారం, హిమఘాతం (ఫ్రోస్ట్బైట్), అల్పోష్ణస్థితి లాంటి పలు అనారోగ్యాల పాలు అవుతారు. పర్వతారోహణాన్ని పూర్తి చేసి గర్వంగా దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగా జరుగుతుంది.

పర్వతారోహణకు పెరిగిన ఆసక్తి:

నేటి వరకు 4,042 మంది పర్వతారోహకులు ఎవరెస్ట్‌ను అధిరోహించగా, అందులో 635 మంది మహిళలు కూడా ఉన్నారు. పర్వతారోహణకు అనేక మాసాల శిక్షణ, తయారీ మరియు సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించుటకు దాదాపు 65,000 డాలర్ల రుసుము, ఖరీదైన పరికరాలు అవసరం అవుతాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని అత్యధికంగా 21 సార్లు అధికోహించిన రికార్డును 'అపా షెర్పా' మరియు 'పుర్బా షెర్పా'లు దక్కించుకున్నారు. ప్రతి ఏటా మే, సెప్టెంబర్ మాసాలు ఎవరెస్టు ఎక్కడానికి అనువైన సీజన్లుగా గుర్తించారు. పర్వతారోహకులకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు 19 రోజులు, అక్కడి నుండి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి దాదాపు 40 రోజుల సమయం పడుతుంది. ప్రతి ఏటా దాదాపు 800 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తున్నారు.

ఎన్ని అవాంతరాలు, ప్రతికూలతలు ఎదురైన పర్వతారోహకులు ఎవరెస్ట్ లాంటి అత్యంత ఎత్తైన మంచు పర్వతాన్ని అధిరోహించాలని తపన పడడం అభినందనీయం. ప్రాణాలకు తెగించి సాహసం చేసే పర్వతారోహణ సాహస వీరులకు శుభాకాంక్షలు తెలియజేద్దాం, ఆ క్రీడ పట్ల యువతకు అవగాహన కల్పించి ప్రోత్సహిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# కంబోడియాలో తెలంగాణ యువకుడికి చిత్రహింసలు

## -కరెంట్ షాక్లు, ఇంజెక్షన్లు

మహబూబ్ నగర్ మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ఉపాధి కోసం కొందరు



నిరుద్యోగులు వేరే దేశాలకు వెళుతుంటారు. అధిక వేతనమంటూ ఏజెంట్లు చెప్పిన మాయమాటలు నమ్మి కొన్నిసార్లు మోసపోతుంటారు. రాష్ట్రానికి చెందిన పలువురు కంబోడియా దేశంలో ఇలాగే మోసపోయారు. గత కొంతకాలంగా ఈ తంతు సాగుతున్నా, ఇటీవల ఈ వ్యవహారం తెరపైకి రావడంతో అక్కడ బాధలు అనుభవిస్తున్న వారు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నాయి. తాజాగా మహబూబాబాద్కు చెందిన ఓ యువకుడు కంబోడియా దేశంలో పెడుతున్న చిత్రహింసలకు సంబంధించి ఒక వీడియోను విడుదల చేశాడు. ఇప్పుడు ఆ వీడియో వైరల్గా మారింది.

బాధితుడి సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం, మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన ప్రకాశ్ అనే యువకుడు కంబోడియా దేశంలో తనను చిత్రహింసలకు గురి చేస్తున్నారంటూ కుటుంబసభ్యులకు ఓ వీడియో పంపించాడు. ఆ వీడియో చూసిన కుటుంబసభ్యులు చలించిపోయారు. ప్రభుత్వమే తమ కుమారుడిని కాపాడాలని విజ్ఞప్తి చేస్తోంది.

ఆస్ట్రేలియా అని చెప్పి కంబోడియాకు : ప్రకాశ్ బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ కొంతకాలం ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. ఈ సమయంలోనే ఓ ఏజెన్సీ ద్వారా ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు ఉన్నాయనే సమాచారం తెలుసుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా, తమకు అంత స్తోమత లేదని చెప్పారు. వారు వద్దని చెప్పినా వినకుండా ఆస్ట్రేలియాకు బయలుదేరాడు. ఆ ఏజెన్సీ వారు మాత్రం అతడిని ఆస్ట్రేలియా తీసుకెళ్లకుండా కంబోడియాలో వదిలేశారు.

అక్కడ వారు విద్యుత్ షాక్, ఇంజెక్షన్లు ఇవ్వడం వంటి చిత్రహింసలు పెడుతున్నారని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అక్కడ నరకయాతన అనుభవిస్తున్నానని, వాళ్లు చెప్పిన పని చేయకపోతే కరెంట్ షాక్ ఇస్తున్నారని, ఆ బాధలు తట్టుకోలేక పోతున్నానంటూ బాధితుడు తన తమ్ముడికి వివరించాడు. అలాగే తనతో పాటు ఇంకా కొంతమంది పురుషులు, మహిళలు కూడా ఉన్నారని, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక బతుకు మీద నమ్మకం లేదని రోదిస్తూ వీడియో పంపించాడని బాధితుడి తమ్ముడు వాపోయాడు. వెంటనే తన అన్నను కాంబోడియా నుంచి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు.

# మిజోరాంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు

## - రాతి క్వారీ కుప్పకూలి 10 మంది మరణించారు

మిజోరాం మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):మిజోరాంలో భారీ వర్షాలు కురుస్తున్నయి. ఎడతెరిపి లేకుండా పడుతున్న వానలకు ఐజ్వాల్ శివార్లలో ఓ రాతి క్వారీ కుప్పకూలి 10 మంది మరణించారు. మరికొంతమంది శిథిలాల క్రింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. వెంటనే పోలీసులతోపాటు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.ఐజ్వాల్ పట్టణం దక్షిణ శివార్లలోని మెల్తుమ్, హ్లిమెన్ మధ్య ప్రాంతంలో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో పలువురు తప్పిపోయినట్లు పోలీసులు తెలిపారు. వర్షం కురుస్తుండడంతో సహాయక చర్యలు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో ప్రాణనష్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రంలో రెమాల్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. తుపాను హెచ్చరికల దృష్ట్యా.. రాష్ట్రంలోని దక్షిణ జిల్లాలకు రెడ్ అలర్ట్, ఉత్తర జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. హంథర్ వద్ద జాతీయ రహదారి 6పై కొండచరియలు విరిగిపడటంతో ఐజ్వాల్ నుంచి ఇతర ప్రాంతాలకు రవాణమార్గాని అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఇక, నదుల నీటి మట్టాలు కూడా పెరుగుతున్నాయని.. నదీతీర ప్రాంతాల్లో నివసించే చాలా మంది ప్రజలను ఖాళీ చేయించినట్లు మిజోరాం డిజిపి వెల్లడించారు.

# క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా

## కొత్త క్రిమినల్ చట్టాలు-నల్సార్ వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు



న్యూఢిల్లీ, మే 27 :అందరికీ న్యాయం అందించడం కోసం సమకాలీన, సాంకేతికతలకు అనుగుణంగా పలు అంశాలను పొందుపరిచి జులై 1 నుంచి దేశంలో అమలు కానున్న మూడు కొత్త క్రిమినల్ చట్టాల పై అవగాహన కల్పించే ఉద్దేశంతో పత్రికా సమాచార కార్యాలయం, హైదరాబాద్ ఆధ్వర్యాన పాత్రికేయ మిత్రుల కోసం, దేశంలో జులై 1 నుంచి అమలులోకి రానున్న 3 క్రిమినల్ చట్టాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు అదనపు డైరెక్టర్ జనరల్ (పిఐబి) శ్రీమతి శృతి పాటిల్ అధ్యక్షత వహించారు.

భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే మూడు కొత్త క్రిమినల్ చట్టాలు 150 ఏళ్ల నాటి బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో దేశంలో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉద్దేశించినవని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు తెలిపారు. భారత శిక్షా స్మృతి (ఐపీసీ) 1860, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ (సీఆర్పీసీ)1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 ల స్థానంలో ఈ మూడు చట్టాలు రానున్నాయని ఆయన తెలిపారు. పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) హైదరాబాద్ ఏర్పాటు చేసిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై నిర్వహించిన వార్తలాప్ - మీడియా వర్క్ షాప్ లో ప్రొఫెసర్ రావు మాట్లాడుతూ, గత ఫిబ్రవరిలో భారత ప్రభుత్వం నోటిఫై చేసి, 2024 జులై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలు శిక్ష కంటే న్యాయంపై దృష్టి సారిస్తాయని, బాధితుల కేంద్రీకృత న్యాయాన్ని నిర్ధారిస్తాయని చెప్పారు. విచారణను వేగవంతం చేయడం ద్వారా, అసమంజసమైన వాయిదాలను అరికట్టడం ద్వారా - సత్వర న్యాయం అందేలా చూడటానికి కాలపరిమితిని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. నవరించిన క్రిమినల్ చట్టాలు మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరించబడ్డాయన్నారు.

దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యల్లో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే మూడు క్రిమినల్ చట్టాలు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ఉండనున్నాయని, ఈ చట్టాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని మాజీ ఐజీ ఈ.దామోదర్ అన్నారు. క్రిమినల్ చట్టాల మైక్రో నైపుణ్యాలను కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం చుట్టూ జరుగుతున్న నేరాల గురించి వివరించారు. కొత్త చట్టాల్లో పేర్కొన్న కమ్యూనిటీ సేవల శిక్షలు మనకు ఇంతకు పూర్వం పూర్తిగా తెలియనివని అన్నారు. వాడుకలో ఉన్న సాంకేతికతకు అనుగుణంగా ఈ మూడు క్రిమినల్ చట్టాల్లో పలు కొత్త నిబంధనలను చేర్చినట్టు చెప్పారు. ఈ చట్టాలు నేరస్తులకు శిక్ష వేయడం కంటే బాధితులకు న్యాయం అందించడంపైనే దృష్టి పెడతాయన్నారు. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై సంఘటన స్థలం నుంచి స్మార్ట్ ఫోన్ ద్వారా ఆన్లైన్లో ఫిర్యాదు చేయవచ్చని, ఆ ఫిర్యాదు రికార్డు అవుతుందని చెప్పారు. నేరస్తులను విచారించేందుకు జ్యుడీషియల్ కస్టడీ కాలపరిమితి పెంచనున్నారని తెలిపారు. పెరిగిన సాంకేతికని నేరాల నియంత్రణకు ఉపయోగించుకోవాలని చెప్పారు.రోడ్డు ప్రమాదాల బాధితులను గోల్డెన్ అవర్లో ఆస్పత్రిలో చేర్చితే మరణాలను నివారించవచ్చునన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ చట్టాల ద్వారా బాధితులకు న్యాయ వ్యవస్థపై మరింత నమ్మకం కలుగుందని చెప్పారు.ఈ చట్టాల వల్ల పరిధితో సంబంధం లేకుండా సంఘటనా స్థలం నుంచే ఫిర్యాదు చేసి ఇ-ఎఫ్ఐఆర్ పొందవచ్చునన్నారు.

శ్రీ ఎన్.రాజశేఖర్, ఐ.పి.ఎస్, డైరెక్టర్, సిడిటిఐ కొత్త క్రిమినల్ చట్టాలలో చేసిన మార్పుల గురించి వివరించారు, ముఖ్యంగా మహిళలు, పిల్లల హక్కులపై ఎక్కువ దృష్టి పెట్టడం, న్యాయవ్యవస్థలో మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, కనీస శిక్ష భావన, చిన్న నేరాలకు శిక్షగా సమాజ సేవను ప్రవేశపెట్టడం వంటి ప్రధాన మార్పులను ఆయన వివరించారు. అన్ని దర్యాప్తు ప్రక్రియలకు కాలపరిమితి విధించారని, పదజాలాన్ని పునర్నిర్వచించారని, ఉదాహరణకు 'చైల్డ్' అనే పదం ఇప్పుడు 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిని నిర్వచిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాజద్రోహాన్ని దేశద్రోహంగా మార్చారని ఆయన అన్నారు. ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలని వ్యవస్థీకృత నేరాలుగా వర్గీకరించినట్లు తెలిపారు.

పత్రికా సమాచార కార్యాలయ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ మాట్లాడుతూ, పత్రికా సమాచార కార్యాలయం, ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు అందించడంలో దాని పాత్రను వివరించారు. బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి కొత్త క్రిమినల్ చట్టాలకు కేంద్ర ప్రభుత్వం మెరుగులు దిద్దినట్లు తెలిపారు. దేశ నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు జులై 1 నుంచి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి 1860), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872లను కొత్త అంశాలతో రూపొందించి కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు.

# మీకు పల్లీలు తినే అలవాటు ఉందా? అయితే మీరు లక్కీ.. ఎందుకంటే..

హైదరాబాద్, మే 27 : తినే అలవాటు ఉందా? అయితే, రోజూ కొద్ది మోతాదులో తింటే గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. పల్లీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కార్డియో వాస్క్యులర్ వ్యాధులు వచ్చే ఆస్కారం చాలా తక్కువని పరిశోధనల్లో తేలింది. అయితే, రోజూ సగటున ఎన్ని పల్లీలు తినాలి? అంటే, ఏ సమయంలోనైనా ఫర్వాలేదు కానీ.. 4-5 వేరు శెనగలు అంటే.. పది గింజల వరకే తినాలట. దీని వల్ల కెమికల్ స్ట్రోక్/కార్డియో వాస్క్యులర్ సమస్య దరిదాపుల్లోకి కూడా రాదని చెబుతున్నారు జపాన్లోని ఒసాకా యూనివర్సిటీకి చెందిన పరిశోధన బృందం సభ్యులు. పల్లీల్లో గుండెకు మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిలోని మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, పాలీ అన్శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, మినరల్స్, విటమిన్స్ వంటివి మంచి చేస్తాయి. అలాగే అధిక రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్ను నియంత్రణలో ఉంచుతాయని కూడా జపాన్ పరిశోధకులు చెబుతున్నారు.

# హైకోర్టులో మాచర్ల వైసిసి ఎంఎల్ఏ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డికి ఊరట

విజయవాడ మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మాచర్ల వైసిసి ఎంఎల్ఏ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డికి ఊరట లభించింది. మూడు కేసుల్లో ఆయనకు ఏపి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈవిఎం ధ్వంసం చేసిన కేసులో ఇచ్చిన బెయిల్ షరతులే వర్తిస్తాయని ఈ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది.ఎన్నికల పోలింగ్ సందర్భంగా రెంటచింత మండలం పాల్వాయిగేట్ ఈవిఎం ధ్వంసంకేసులో ఇప్పటికే పిన్నెల్లికి బెయిల్ మంజూరు కాగా తర్వాత జరిగిన సంఘటనల్లో, ఇతర కేసుల్లో కూడా హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

# ఏపీలో 144 సెక్షన్.. ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

అమరావతి, మే 28 :ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఉత్కంఠ పెరిగిపోతోంది. అందరి సందేహాలు, పార్టీ అంచనాలు, గెలుపు లెక్కలు తేలే సమయం వచ్చేస్తోంది. ఎవరు గెలుస్తారు అనే ప్రశ్న ఓవైపు ప్రజలను, నేతలను గ్రిల్ చేస్తుంటే కౌంటింగ్ సజావుగా ఎలా జరపాలనే సందేహం అధికారులను వేధిస్తోంది. కాగా, రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి గందరగోలం, గొడవలు, ఎర్పడకుండా.. విధ్వంసాలు జరగకుండా రాష్ట్రంలో ఎన్నికల సంఘం పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈసారి కేంద్ర బలగాలను భారీగా మోహరిస్తు న్నారు.

కేంద్ర బలగాలు ఉన్న ప్రాంతం తోపాటు మిగతా ప్రాంతాలపై కూడా ఎన్నికల సంఘం నజర్ పెట్టింది. అందుకే లెక్కింపు రోజున ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 144 సెక్షన్ వధిస్తున్నట్టు ప్రకటించింది. ఆ రోజు ప్రజల రోజు వారి పనులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో జూన్ ఆరో తేదీ వరకు ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం ఉంది. అదే టైంలో బాణాసంచాపై కూడా ఆంక్షలు పెట్టారు.

జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కోసం 20కంపెనీల బలగాలను బందోబస్తు కోసం ఆంధ్రప్రదేశ్‌లోకి దింపుతోంది ఎన్నికల సంఘం. ఇప్పటికే ఘర్షణలతో హీటెక్కిన పల్నాడు, చంద్రగిరి, తాడిపత్రితో పాటు ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ బలగాలను మోహరించ బోతున్నారు. ఆయా ప్రాంతాల్లో అణువణువూ గాలించి అనుమానితలను అదుపులోకి తీసుకోనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోనున్నారు.

ఇక ప్రస్తుతం పోలీసు శాఖ, ఇతర అధికారులు, సిట్ బృందాల ఆధ్వర్యం చేపట్టిన చర్యలు కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా తెలిపారు. పోలింగ్ తర్వాత కొన్ని ప్రాంతాల్లో అల్లర్లు జరిగాయని కేంద్ర బలగాల రంగ ప్రవేశంతో పరిస్థితి అదుపులోకి వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు ప్రశాంతంగా తిరుగుతున్నారని ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేదని వివరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యి ఎన్నికల కోడ్ తొలగిపోయే వరకు ఇదే పరిస్థిత కొనసాగించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నట్టు మీనా వెల్లడించారు.

# అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచండి

## - బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



హన్మకొండ, మే 27: (నేటినిజం ప్రతినిధి)అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచాలని జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు.మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వరంగల్ పరిధి కి సంబంధించి ఏ ఈ ల వారిగా ఇప్పటి వరకు పూర్తయిన నిర్మాణంలో ఉన్న పనుల స్థితి గతులను డి ఈ లను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ పరిధిలో గల పాఠశాలల్లో పనులలో వేగం పెరగాల్సిన అవసరం ఉందని ప్రధానంగా స్కూల్ లలో త్రాగునీటి వసతులు ఏర్పాటు వంటి ప్రాథమిక అవసరాల పై ప్రత్యేక దృష్టి సారించి ముందుగా పూర్తి చేయాలని ముందుగా మైనర్ సంబంధిత పనులను పూర్తి చేసి మేజర్ పనులపై దృష్టి సారించాలని పాఠశాలల్లో టాయిలెట్ నిర్మాణ సంబంధిత పనులు మినహా మిగతా పనులన్నీ ఈ నెల 31 లోగా పూర్తి చేయాలని పనులను వేగంగా పూర్తి చేయడానికి లేబర్ సంఖ్యను పెంచి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ కృష్ణ రావు, ఈఈ లు రాజయ్య శ్రీనివాస్, డి ఈలు రవికుమార్, సంతోష్ బాబు, సారంగం, రంగ రావు రవికిరణ్ శివానంద్ తదితరులు పాల్గొన్నారు.


## రెండు పుస్తకాల ఆవిష్కరణ ఆహ్వానము

తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో
"యుద్ధగీతం", "కవన సమీరాలు" రెండు పుస్తకాల
ఆవిష్కరణ సభ
తేది : 01-జూన్, 2024 శనివారం సాయంత్రం : 5-00 గం॥లకు
వేదిక : కర్షక్ బి.ఇడి. కళాశాల, కామారెడ్డి.

సభాధ్యక్షులు : యెనిశెట్టి గంగాప్రసాద్ గారు ప్రముఖ కవి, రచయిత
ముఖ్య అతిథి : బైస దేవదాస్ గారు "నేటి నిజం" తెలుగు దినపత్రిక సంపాదకులు
ప్రత్యేక అతిథులు :
తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి గారు ప్రముఖ సంఘసేవకులు, సాహితీ పోషకులు
కొండి మల్లారెడ్డి గారు ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు
విశిష్ట అతిథులు
డా॥ జి. లచ్చయ్య గారు ప్రముఖ రచయిత, కాలమిస్టు.
సూరారం శంకర్ గారు ప్రముఖ కవి, రచయిత, చిత్రకారులు, కీర్తి పురస్కార గ్రహీత
వి.పి. చందన్‌రావు గారు ప్రముఖ రచయిత, నిజామాబాద్
డా॥ యస్.కె. రషీద్ గారు ప్రిన్సిపాల్, కర్షక్ బి.ఇడి. కళాశాల, కామారెడ్డి.
మారవేణి రాజన్న గారు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కామారెడ్డి.
ఆత్మీయ అతిథులు
డా॥ కాసర్ల నరేష్ రావు గారు ప్రముఖ కవి, రచయిత
నార్ల అరుణ్ కుమార్ గారు పండిత పరిషత్ టి. జిల్లా అధ్యక్షులు
అంభీర్ మనోహర్‌రావు గారు ప్రముఖ వ్యాఖ్యాత
అల్లి మోహన్ రాజ్ గారు తె.ర.వే. జిల్లా ప్రధాన కార్యదర్శి
డా॥ బాలు గారు రక్తదాతల సమూహ ఫౌండర్, కామారెడ్డి జిల్లా.
కప్పెర రవీందర్ రెడ్డి గారు వైస్ ఎంపిపి, బీబీపేట్.
వెంగల నాగరాజు గారు తె.ర.వే. జిల్లా అధ్యక్షులు, రాజన్నసిరిసిల్ల.







పుస్తక సమీక్షకులు
సిరిసిల్లా గఫూర్ శిక్షక్ గారి "యుద్ధగీతం" ----- డా॥ మేకల రామస్వామి గారు డిగ్రీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు
ఎన్నీల ముచ్చట్లు ఉగాది కవితా సంకలనం "కవన సమీరాలు" ----- డా॥ నమిలకొండ సునీత గారు ప్రముఖ రచయిత్రి
సభా ఆహ్వానం, కార్యక్రమ సమన్వయం, వ్యాఖ్యానం పబ్బ విజయశ్రీ గారు ప్రముఖ వ్యాఖ్యాత
నోట్ : రక్తదాతల సమూహం, కామారెడ్డి సభ్యులకు సత్కారం.
"కవన సమీరాలు" పుస్తకంలోని కవులకు అతిథులచే సత్కారం.
కార్యక్రమానంతరము భోజన సౌకర్యం కలదు

# ప్రగతి-2024ను నిర్వహించనున్న సెంట్రల్ కౌన్సిల్ ఫార్ రిసర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస(సిసిఆర్ఎఎస్)

న్యూఢిల్లీ, మే 28 :"ఫార్మా రిసర్చ్ ఇన్ ఆయుర్జ్ఞాన్ ఎండ్ టెక్నో ఇనొవేశన్ (పిఆర్ఎజిఎటిఐ-2024)" కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లోని స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినటువంటి సెంట్రల్ కౌన్సిల్ ఫార్ రిసర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సిసిఆర్ఎఎస్) న్యూ ఢిల్లీ లోని ఇండియా హేబిటేట్ సెంటర్ లో 2024 మే 28 వ తేదీ న నిర్వహించనుంది. ఈ చర్చ ప్రధానమైనటువంటి సమావేశం సిసిఆర్ఎఎస్ మరియు ఆయుర్వేద ప్రధానమైన ఔషధ పరిశ్రమ లకు మధ్య పరిశోధన అవకాశాల ను అన్వేషించడం తో పాటు సహకారాన్ని పెంపొందింపచేయడం పై శ్రద్ధ ను వహించనుంది.

ఈ కార్యక్రమాన్ని ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ రాజేశ్ కోటేచా ప్రారంభించనున్నారు. ఆయుర్వేద యొక్క అభివృద్ధి లో పరిశ్రమ యొక్క పాత్ర ను గురించి ఆయన కీలకోపన్యాసాన్ని ఇవ్వను న్నారు. ఈ కార్యక్రమం లో ఆయుష్ మంత్రిత్వ శాఖ యొక్క సంయుక్త కార్యదర్శి కవిత గర్గ్ గారు మరియు ఆ మంత్రిత్వ శాఖ సలహాదారు డాక్టర్ శ్రీ కౌస్తుభ ఉపాధ్యాయ్ గారు లు కూడా పాలుపంచుకొంటారు.

సిసిఆర్ఎఎస్ యొక్క డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ శ్రీ వైద్య రబినారాయణ్ ఆచార్య, సిసిఆర్ఎఎస్ పక్షాన ఈ చర్చ ప్రధానమైన సమావేశానికి నాయకత్వాన్ని వహించనున్నారు. ఈ సమావేశం లో పరిశోధన ఆధారితమైన, నాణ్యత, సంరక్షితమైన మరియు ప్రభావవంతమైనటువంటి ఆయుర్వేద ఉత్పాదన ల యొక్క ప్రాముఖ్యాన్ని గురించి వివరించడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వడం జరుగుతుంది. దీని ఉద్దేశ్యం ఆయుర్వేద సూత్రీకరణ (ఫార్ములేశన్) లు మరియు సాంకేతిక పరమైన నూతన ఆవిష్కారాల లో భాగం పంచుకొన్న పరిశోధకుల ను మరియు పారిశ్రామిక భాగస్తుల ను కలుపుకొని, ఔషధాలు మరియు పనిముట్టుల అభివృద్ధి లో ఆయుర్వేద రంగ స్టేక్ హోల్డర్స్ యొక్క శక్తియుక్తుల ను గరిష్ఠ స్థాయి కి పెంచడం అనేవి ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యాలు గా ఉన్నాయి.

వాటిలో ఒకటోసదస్సు లో పరిశోధన- పరిశ్రమ ల సహభాగ స్వామ్యాన్ని బలపరచడం కోసం సిసిఆర్ఎఎస్ యొక్క ఉత్పాదన అభివృద్ధి కార్యక్రమాన్ని మరియు వ్యూహాల ను స్పష్టంచేయడం జరుగుతుంది. దీనిలో అన్ని 35 ఉత్పాదనలు మరియు పనిముట్టుల ప్రదర్శన కలసి ఉంటుంది. దీనితో పాటు యావత్తు దేశం లో గల 5 సిసిఆర్ఎఎస్ ప్రయోగశాల లు మరియు 25 ఆసుపత్రుల సేవల ను గురించి కూడా చాటిచెప్పడం అనేది ఒక భాగం గా ఉంటుంది.

రెండో సదస్సు లో ప్రాంతీయ మరియు ప్రపంచ స్థాయి ఆయుర్వేద ఔషధ వికాసం లో లోటుపాటుల ను గుర్తించడం మరియు సవాళ్ళ ను పరిష్కరించడం కోసం ఒక బృంద చర్చ ను నిర్వహించడం జరుగుతుంది.

మూడో సదస్సు లో సహకార కార్యక్రమాల నిర్వహణకై ప్రాధాన్య రంగాల ను గుర్తించడం తో పాటే అనుభవాన్ని వెల్లడించుకోవడం మరియు సిసిఆర్ఎఎస్ నుండి పరిశ్రమ ఏమి ఆశిస్తున్నదీ తెలియజేస్తారు.

నాలుగో సదస్సు లో సిసిఆర్ ఎఎస్- పరిశ్రమ సహభాగస్వామ్యం కోసం మొట్టమొదటి సారి "పరిశోధన ప్రాథమ్యాల నిర్దేశం" అంశం పై ప్రత్యేకించినటువంటి సమూహ చర్చ ను నిర్వహించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమం లో దేశవ్యాప్తం గా 35 ఔషధ నిర్మాణ వ్యాపార సంస్థల ప్రతినిధులు పాలుపంచుకనున్నారు. వారి లో హిమాలయ, ఇమామి, బైద్యనాథ్, డాబర్, ఐఎమ్‌పిసిఎల్, ఆర్య వైద్య శాల, ఔషధి, ఇంకా ఐఎమ్‌పిసిఒపిఎస్ ల వంటి ప్రముఖ వ్యాపార సంస్థ ల సిఇఒ లు కొంత మంది పాల్గొంటారు. అదనం గా ఈ చర్చాత్మక సమావేశం లో పాల్గొనడం కోసం సిఐఐ, ఆయుష్ ఎక్సిల్, పిసిఐఎమ్‌హెచ్ మరియు ఎన్ఆర్‌డిసి ల నుండి ఆహ్వానించినటువంటి నిపుణులు వారి వారి పేరుల ను నమోదు చేసుకొన్నారు.

సిసిఆర్ఎఎస్ ద్వారా అభివృద్ధి పరచినటువంటి లేదా అభివృద్ధి ప్రక్రియ పురోగతి లో ఉన్నటువంటి మొత్తం 35 ఫార్ములేశన్ లు మరియు మూడు పనిముట్టుల ను గురించి వివరించేటటువంటి ఒక వివరణ పత్రాన్ని చర్చించడం మరియు సమీక్షించడం కోసం ఈ సమావేశం లో పాలుపంచుకొనేటటువంటి పరిశ్రమల ప్రతినిధుల ఎదుట సమర్పించడం జరుగుతుంది. వీటి లో ఆయుష్ 64, ఆయుష్ ఎస్‌జి, ఆయుష్ గుట్టీ, తదితరాలు భాగం గా ఉన్నాయి.

సిసిఆర్ఎఎస్ తో కలసి నడవనున్న శాస్త్ర విజ్ఞాన సంబంధి జ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోనున్న, ఆయుర్వేద ఔషధాల అభివృద్ధి లో పరిశోధన ల ఫలితాలు మరియు ఉత్పాదనల ను ఉపయోగించుకోవాలన్న ఆసక్తి ని కలిగివున్న పారిశ్రామిక భాగస్తుల ను గుర్తించడం అనేవి 'ప్రగతి-2024' ద్వారా అభిలషిస్తున్న పరిణామాల ను సూచిస్తున్నాయి. ఈ కార్యక్రమం నెట్‌వర్కింగ్ ను మరియు సంస్థాగతమైన సంబంధాల ను సుదృఢపరచగలదు; తత్ఫలితం గా ఆయుర్వేదిక వైద్యశాలల కు మరియు ఆయుర్వేదిక రోగుల ప్రయోజనం చేకూరగలదు.

# ప్రజా భవన్‌కు బాంబు బెదిరింపు.. అప్రమత్తమైన పోలీసులు

హైదరాబాద్ మే 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బేగంపేటలోని ప్రజా భవన్‌కు బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. ప్రజా భవన్‌లో బాంబు ఉందంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. పది నిమిషాల్లో బాంబు పేలుతుందని హెచ్చరించారు. అప్రమత్తమైన హైదరాబాద్ పోలీసులు ప్రజా భవన్ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ప్రజా భవన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ప్రజా భవన్‌ను తమ ఆధీనంలోకి తీసుకుని, క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రజా భవన్ ఆవరణలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసం ఉంటున్నారు. ఇటీవల ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలోని ప్రముఖ ప్రదేశాలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఈ తరహా బాంబు బెదిరింపు కాల్స్ వెనుక ఓ ముఠా హస్తం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. వరుసగా బాంబు బెదిరింపు కాల్స్ వస్తున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు లోతుగా విచారిస్తున్నారు.

# చిన్నారులను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాను మేడిపల్లి పోలీసులు అరెస్టు

## -ముఠాను అరెస్ట్ చేసి 16మంది చిన్నారులను కాపాడిన పోలీసులు




హైదరాబాద్, మే 28 :చిన్నారులను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాను రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ముఠాను అరెస్ట్ చేసి 16మంది చిన్నారులను కాపాడారు. బాలబాలికల్లో కొందరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల మేడిపల్లిలోని చిన్నారి విక్రయంతో ముఠా వ్యవహారం బయటపడింది. నాలుగు రోజుల క్రితం ఫిర్జాదిగూడలో రూ.4.50 లక్షలకు ఆర్ఎంపీ డాక్టర్ శోభారాణి శిశువును విక్రయించారు. ఆమెతో పాటు సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు దర్యాప్తు జరపడంతో ముఠా గుట్టురట్టయింది.

మొత్తం 16 మంది చిన్నారులను ముఠాకు విక్రయించినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై రాచకొండ సీపీ తరుణ్ జోషి పలు విషయాలను తెలిపారు.నెల నుంచి రెండేళ్ల వయసు పిల్లలను అమ్ముతున్నట్లు తెలిసిందని సీపీ పేర్కొన్నారు. పిల్లలు లేనివారికి అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందని వివరించారు. ఇటీవల మేడిపల్లిలో శోభారాణి, సలీం, స్వప్నను అరెస్టు చేశామని గుర్తు చేశారు. వారిని అరెస్టు చేసిన సమయంలో ఇద్దరు చిన్నారులను రక్షించామని అన్నారు. ఈ విషయంలో మరింత లోతుగా దర్యాప్తు చేసి విక్రయ ముఠాతో సంబంధమున్న ఏజెంట్లను పట్టుకున్నామని పేర్కొన్నారు. మొత్తం 8 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ముఠాతో సంబంధమున్న నిందితులు ఢిల్లీ, పుణెల నుంచి పిల్లలను తీసుకొచ్చి అమ్ముతున్నట్లు గుర్తించామని సీపీ తెలిపారు. ఆయా నగరాల్లో ఉన్న వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందం వెళ్లిందని తెలిపారు. ఈ కేసులో మొత్తం 16 మంది మంది చిన్నారులను రక్షించామని చెప్పారు."పిల్లలను విక్రయించే ముఠాతో సంబంధమున్న ఏజెంట్లను పట్టుకున్నాం. మొత్తం 8 మందిని అరెస్టు చేశాం. ఢిల్లీ, పుణెల నుంచి పిల్లలను తీసుకొచ్చి అమ్ముతున్నట్లు గుర్తించాం. ఈ కేసులో మొత్తం 16 మంది మంది చిన్నారులను రక్షించాం. ఢిల్లీ, పుణెలో ఉన్నవారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందం వెళ్లింది."

# ఓట్ల లెక్కింపు శాంతియుతంగా నిర్వహించాలి- కలెక్టర్ మనజీర్




శ్రీకాకుళం, మే28 : ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లను లెక్కించే ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు నిర్వర్తించే పాత్ర అత్యంత కీలకమని, సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు కలిసికట్టుగా పని చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జీలాని సమూన్ లెక్కింపు ప్రక్రియ సూక్ష్మ పరిశీలకులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో సార్వత్రిక ఎన్నికలు -2024 నేపథ్యంలో జూన్ 4 వ తేదీన నిర్వహించనున్న లెక్కింపు ప్రక్రియపై సూక్ష్మ పరిశీలకుల శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జీలాని సమూన్ పాల్గొన్నారు..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13 న పోలింగు రోజున ఎంతో కీలకమైన బాధ్యతలు నిర్వహించడం జరిగిందని, ఆ క్రమంలో సూక్ష్మ పరిశీలకులు మంచిగా పనిచేసారని, పెద్ద ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోవడం జరిగిందన్నారు. గత ఆరు నెలలుగా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు రిటర్నింగ్ అధికారులు నుంచి వివిధ స్థాయి లో అధికారులు సిబ్బంది తదితరులు పని చెయ్యడం జరిగిందన్నారు. పోలింగ్ రోజున మనందరం కలిసి కట్టుగా ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా కౌంటింగ్ దశకు చేరుకున్నట్లు తెలిపారు. అయితే మరో కీలక మైన బాధ్యతలు మనందరిపై ఉందని తెలిపారు.

జూన్ 4 వ తేదీన ఓట్లను లెక్కించే ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమన్నారు. పోలింగ్ రోజున కష్టతరమైన విధులను, బాధ్యతలను సూక్ష్మ పరిశీలకులు ఎంతో ఇష్టంగా చేశారని తెలిపారు. జూన్ 4 వ తేదీన లెక్కింపు కేంద్రాల్లోని ప్రతి టేబుల్ వద్ద ఒక సూక్ష్మ పరిశీలకుని నియమించడం జరుగుతుందన్నారు. నిబంధనల మేరకు సజావుగా లెక్కింపు ప్రక్రియ పూర్తి చేయడానికి సూక్ష్మ పరిశీలకులు కృషి చేయాలని, పోస్టల్ బ్యాలెట్, ఈ టి పిబి ఎస్, ఈవిఎమ్ లలో ఓట్లు, వివి పాట్స్ ఓటర్ స్లిప్స్ లెక్కింపు చెయ్యాల్సి ఉంటుందని అన్నారు. సూక్ష్మ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు పోలింగ్ రోజు ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారు.

కౌంటింగ్ ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్‌లను నిర్వహించడం, ఎలక్ట్రానిక్‌గా ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ , ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లు (ఈవీఎం ) ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్స్ వంటి వివిధ అంశాలను మైక్రో అబ్జర్వర్స్ నిశితంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. . పవర్ ఫాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయిలో ఈ మొత్తం ప్రక్రియ ను వివరించడం జరిగిందన్నారు. కొన్ని సందర్భాలలో పరిశీలకులుగా తీసుకోవలసిన జాగ్రత్తలు విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. వాటికి అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు నిర్ణయాలు తీసుకుంటారని జిల్లా ఎన్నికల అధికారి తెలియ చేశారు. ఫ్రీ, ఫెయిర్, పారదర్శకంగా ఓట్ల లెక్కింపు చెయ్యడం మీ అందరిపై ఉన్న ప్రధాన బాధ్యత అని తెలిపారు . ఓట్ల లెక్కింపులో పరిశీలన ప్రక్రియ లో అత్యంత జాగ్రత్తగా ఉండాలని , ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించడం లో మీ వంతు పనితనం ముఖ్యం అన్నారు . ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డు తప్పనిసరి అని లెక్కింపు కేంద్రం వద్ద అల్పాహారం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ఈ శిక్షణా తరగతుల కార్యక్రమంలో నోడల్ అధికారి ఎన్ బాలాజీ, మాస్టర్ ట్రైనర్లు శేషగిరి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఎల్డిఎం సూర్య కిరణ్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వ మోహన్ రెడ్డి, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

# పశ్చిమ బంగాల్ కోస్తా తీరానికి ఆవల సముద్రంలో జీవన నష్టాన్నిగాని లేదా సంపత్తి నష్టాన్ని గాని అతితక్కువ స్థాయి కి పరిమితం

న్యూఢిల్లీ, మే 28 :భారతీయ కోస్తాతీర రక్షక దళం (ఐసిజి) గంభీరన మహా చక్రవాతం (ఎస్‌సిఎస్) 'రేమల్' తో తలెత్తిన స్థితిని ఫలప్రదం గా ఎదుర్కోవడం కోసం కేంద్ర మరియు రాష్ట్ర ఏజెన్సీల తో కలసి మార్గదర్శక ప్రాయమైనటువంటి సమన్వయాన్ని చాటింది. ఈ చక్రవాతం మే 22 వ తేదీ న అల్పపీడన ప్రాంతం గా ఉత్పన్నమైంది మరియు మే 26-27 వ తేదీ ల మధ్య రాత్రి కి పశ్చిమ బంగాల్ మరియు బాంగ్లాదేశ్ ల కోస్తా తీరాల లో భూమి మీదకు చేరుకొనే కంటే ముందు శీఘ్రం గా ముమ్మరించి ఎస్‌సిఎస్ గా మారిపోయింది.

దీని తరువాత, కోస్ట్ గార్డ్ రీజియన్ (నార్థ్-ఈస్ట్) యొక్క ప్రధాన కేంద్రం ముందుజాగ్రత చర్యల ను మొదలుపెట్టింది; వేరు వేరు కేంద్ర మరియు రాష్ట్ర స్థాయి ఏజెన్సీల తో సమన్వయాన్ని నెలకొల్పుతున్నది. తత్ఫలితం గా సముద్రం లో ఎటువంటి ప్రాణ నష్టం గాని, ఆస్తి నష్టం గాని సంభవించలేదు. స్థితి ని ప్రభావవంతమైన పద్ధతి లో నియంత్రించడమైంది. ఐసిజి తుపాను రాకడ ను దృష్టి లో పెట్టుకొని తుపాను కాలం లో వ్యాపార నౌకల ను చురుకుగా కాపు కాస్తూ , వ్యూహాత్మక సురక్ష కు పూచీపడాలన్న ఉద్దేశ్యం తో నౌకలను, విమానాల ను మరియు తీరం మీది పహారా వ్యవస్థల ను మోహరించింది. హల్దియా, ఇంకా పారాదీప్ లలో గల ఐసిజి యొక్క రిమోట్ ఆపరేటింగ్ స్టేశన్స్ నుండి ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాల ను ప్రసారం చేయడమైంది. చేపల ను పట్టే పడవ లు మరియు ఇతర వ్యాపార సంబంధి నౌకల ను అప్రమత్తం చేసింది.

ఐసిజి యొక్క నౌక వరాద్ ఎస్‌సిఎస్ తీరం దాటడం తోనే స్థితి ని సమీక్షించడం కోసం పారాదీప్ నుండి బయలుదేరింది. దీనికి అదనం గా, రెండు డోర్నియర్ విమానాలు భువనేశ్వర్ నుండి నింగికి ఎగశాయి; అవి బంగాళాఖాతం ఉత్తర ప్రాంతం లో విస్తృత పహారా బాధ్యతల ను నిర్వర్తించాయి.

# ప్రభుత్వం గుర్తింపు లేని నారాయణ పాఠశాలను సీజ్ చేయాలి..

## -ఏఐఎస్ఎఫ్, పీ డీ ఎస్ యూ, ఏఐఎస్ఎ డీఈవో కి వినతి

## -లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరిక



అమరావతి, మే 28 : ప్రభుత్వ గుర్తింపు లేకుండా అడ్మిషన్ చేస్తున్న నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని పీడీఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.నాగరాజు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని కలెక్టర్ కార్యాలయం నందు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) కు ఇవాళ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ? కర్నూలు నగరంలో జోహరాపురం నందు ప్రభుత్వ గుర్తింపు లేకుండా, బిల్డింగ్ నిర్మాణం కాకుండా అక్రమంగా అడ్మిషన్ లు చేస్తున్న నారాయణ పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలన్నారు. విద్యా అకాడమిక్ ఇయర్ ప్రారంభం కాకపోయినా అక్రమంగా అడ్మిషన్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నారాయణ పాఠశాలలో టెక్నో, ఈ టెక్నో ఒలంపియాడ్, సిఓ, కోర్సుల పేరుతో అక్రమంగా అడ్మిషన్ చేస్తూ వేలకు వేలు ఫీజులు వసూలు చేసుకుంటున్నారన్నారు. కొత్త కొత్త పేర్లతో, కోర్సులతో అడ్మిషన్ చేసుకుంటే వారిపైన జరిమానా విధించాలని విద్యాశాఖ అధికారులు జీవోలు అమలు చేస్తున్నారు, కానీ కర్నూలు నగరంలో నారాయణ పాఠశాల ప్రభుత్వ జీవోలను, విద్య అధికారులను లెక్కచేయకుండా బహిరంగంగా ఫ్లెక్సీల రూపంలో, కరపత్రాల రూపంలో కొత్త కొత్త కోర్సుల పేరుతో అడ్మిషన్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వ జీవో నెంబర్ 48 ప్రకారం పాఠశాలపై జరిమాన విధించి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అక్రమంగా పాఠశాలలో పుస్తకాలు, దుస్తులను బహిరంగంగా సరుకుల్లాగా అమ్ముతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నారాయణ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్, పీడీఎస్ యూ నగర అధ్యక్షుడు దామోదర్, నగర నాయకులు నవనీత్, వర్ధన్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి నాని, తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులైంది.. ఇంకా నోరుమెదపరేం.. సీఎస్ ను ప్రశ్నించిన మూర్తి యాదవ్




అమరావతి, మే 28 :వేల కోట్ల రూపాయల విలువ చేసే దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములు బలవంతపు రిజిస్ట్రేషన్ల విషయంలో ఏపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డిపై ఆరోపణలు చేసి 72 గంటలైందని, ఇప్పటికీ ఆయన నుంచి సరైన సమాధానం లేదని జనసేన నేత పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం విశాఖలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ? బీసీ, ఎస్సీ, ఎస్టీలను భయపెట్టి జవహర్ రెడ్డి అండ్ కో అసైన్డ్ భూములు దోచుకున్నారని, చకచకా రిజిస్ట్రేషన్లు చేసేసుకొన్నారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో వేలకోట్ల రూపాయల అతి భారీ భూ కుంభకోణమన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ స్ఫూర్తికి, ఆశయాలకు విరుద్ధంగా ఐఏఎస్ ల నేతృత్వంలో జరిగిన కుంభకోణమిదన్నారు. దళితులకు ప్రభుత్వ భూములు ఇవ్వాల్సిన జవహర్ రెడ్డి లాంటి ఐఏఎస్ లు అంతకుముందు ప్రభుత్వాలు కేటాయించిన భూములను తన బినామీల పేరిట రాయించుకోవడం దారుణమని, దళితుల పొట్ట కొట్టడమే అని ధ్వజమెత్తారు.

జవహర్ రెడ్డి ముఠా ముందే భూములు రాయించుకున్నారని ఆ పనులన్నీ పూర్తయ్యాక ప్రధాన కార్యదర్శిగా వున్న జవహర్ రెడ్డి తన పలుకుబడితో ఆ తర్వాత జీఓ 596 రిలీజ్ చేశారని చెప్పారు. గండిగుండంలో సర్వే నంబర్ 271/6 కాలకొండ భరత్ సుభాష్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ముకుందపురం నుంచి మెహెర్ చైతన్య వర్మ రుద్రరాజు, సుభాష్ పేరుపై అనేక రిజిస్ట్రేషన్ లు జరిగాయని డాక్యుమెంట్లను విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఆనందపురం మండలంలోని భూమి భోగాపురంలో కూడా రిజిస్ట్రేషన్ లు జరిగాయని, రాజ్ కుమార్ అగర్వాల్ పేరుపైనా అనేక రిజిస్ట్రేషన్ లు జరిగాయని చెప్పారు. సుభాష్ అనే వ్యక్తి ఎవరు? మెహెర్ చైతన్య వర్మ రుద్రరాజు,రాజ్ కుమార్ అగర్వాల్ లు ఎవరు అని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే అసైన్డ్ భూముల స్కాంకు ఈ రాష్ట్రంలోనే సంబంధంలేని సూర్రెడ్డి త్రిలోక్ సూత్రదారి అని మూర్తి యాదవ్ ఆరోపించారు.

ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ల వివరాలు బహిర్గంతం కాకుండా ఈసి లు, సర్టిఫైడ్ కాపీలు రాకుండా రెవిన్యూ వెబ్ సైట్ ని జవహర్ రెడ్డి బ్లాక్ చేయించారని మూర్తి యాదవ్ ఆరోపించారు. కుంభకోణం బయటపెట్టిన మూర్తి యాదవ్ ని ఎలా జైలుకు పంపాలో జవహర్ రెడ్డ సమీక్ష జరిపారని ఆరోపించారు. నిజానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష జరపాల్సింది దళితలకు జరిగిన అన్యాయం గురించి, జీ వోను అడ్డం పెట్టుకొని దళితుల పొట్టగొట్టిన తీరు గురించి అని అన్నారు. ఇప్పటికైనా తాను చేసిన ఆరోపణలు తప్పని నిరూపిస్తే తాను విశాఖ సీపీ దగ్గరికి వెళ్లి లొంగిపోతానని మూర్తి యాదవ్ సవాల్ విసిరారు. మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గ ఇంచార్జి పి వి స్ న్ రాజు, ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయ కర్త నాగలక్ష్మి చౌదరి పాల్గొన్నారు.

# జొన్న రైతులకు శుభవార్త.. మార్క్ ఫెడ్ ధర పెంపు

మెదక్, మే 28 : మెదక్ జిల్లాలో ప్రతి ఎకరాకు 8 క్వింటాల్ల జొన్నలను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయటం వల్ల రైతులను మిగతా పంటను ఎవరికి అమ్ముకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రైతుల కష్టాలు తెలుసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహా? రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వ కార్యదర్శికి లేఖ రాశారు. మెదక్ జిల్లాలోని జొన్న రైతుల పట్ల ప్రత్యేక చొరవ తీసుకుని ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు.

# టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం..

హైదరాబాద్, మే 28 :తెలంగాణలో జూన్ 3 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 51,237 మంది హాజరుకానున్నారని.. ఇందులో బాలురు 31,625 మంది, బాలికలు 19,612 మంది ఉన్నట్లు తెలిపారు.

పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 170 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్‌లను ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామని, వెబ్‌సైట్‌లో కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కృష్ణారావు తెలిపారు. అయితే రూ.50 ఆలస్య రుసుముతో పరీక్ష ప్రారంభానికి రెండు రోజుల ముందు వరకు దరఖాస్తులను సమర్పించవచ్చు. సప్లిమెంటరీ పరీక్ష కోసం, ఒకటి నుండి మూడు సబ్జెక్టులకు దరఖాస్తుదారులు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125 చెల్లించాలి.

పదోతరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షల షెడ్యూలు ఇలా..

జూన్ 3న: తెలుగు, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు-1, కాంపోజిట్ కోర్సు-2 పరీక్షలు

జూన్ 5న: సెకండ్ లాంగ్వేజ్

జూన్ 6న: ఇంగ్లిష్

జూన్ 7న: మ్యాథమెటిక్స్

జూన్ 8న: భౌతికశాస్త్రం (ఫిజికల్ సైన్స్)

జూన్ 10న: జీవశాస్త్రం (బయాలజీ)

జూన్ 11న: సాంఘికశాస్త్రం (సోషల్ స్టడీస్)

జూన్ 12న: ఓఎస్ఎస్‌సీ (ఓరియంటల్ సెకండరీ స్కూల్ సర్టిఫికేట్) ప్రధాన భాష (సంస్కృతం, అరబిక్) పేపర్-1,

జూన్ 13న: ఓఎస్ఎస్‌సీ ప్రధాన భాష (సంస్కృతం, అరబిక్) పేపర్-2 పరీక్షలు జరుగుతాయి.

# రవాణ శాఖ ఆఫీసులపై అటాక్ ..మారు వేషంలో ఏసీబీ రెయిడ్

హైదరాబాద్, మే 28 :ఏసీబీ దూకుడు పెంచింది. మంగళవారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులు లంచం తీసుకుంటున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో తనిఖీలు చేపట్టారు. తెలంగాణవ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏసీబీ సీక్రెట్ ఆపరేషన్ చేపట్టింది. మారువేషంలో వెళ్లి అవినీతి భరతం పడుతున్నారు అధికారులు

## వంద రూపాయల నుంచి వసూళ్లు..

తాజాగా లారీ డ్రైవర్లుగా అశ్వారావుపేట చెక్‌పోస్ట్‌కు వెళ్లారు అధికారులు. ఏసీబీ అధికారులను లంచం డిమాండ్ చేశారు ఆర్టీఏ చెక్ పోస్టు అధికారులు. ఒక్కో వాహనానికి అనధికారికంగా రూ.100 వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. తెలంగాణ, ఏపీ సరిహద్దు చెక్‌పోస్టు కావడంతో అధికారుల చేతివాటం చూపిస్తున్నారు. ఏసీబీ సీక్రెట్ ఆపరేషన్‌లో బాగోతం బయటపడింది. ఇక రంగారెడ్డి, అదిలాబాద్ తో పాటు నల్గొండ, మెదక్, మహబూబ్ నగర్ జిల్లల్లో సైతం ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు.. ఈ సోదాలలో భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు.. అలాగే పలు చెక్ పోస్ట్ లలో లెక్కలలోకి రాని నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు.. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది..

# ప్రభుత్వ విప్ ఆదితో వెలిచాల రాజేందర్ రావు భేటీ



కరీంనగర్, మే 27 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్రావు మంగళవారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నాయకులతో, కార్యకర్తలతో సరదాగా ముచ్చటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన విజయం కోసం కష్ట పడ్డ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెలిచాల రాజేందర్ రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు నాగుల విష్ణు, పుల్కం రాజు, కూరగాయల కొమురయ్య అరుణ్ తేజ చారి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, మే 28 : :(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల నియోజకవర్గ కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి ఆవునూరి దయాకర్ రావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవునూరి దయాకర్ రావు మాట్లాడుతూ తెలుగుజాతిని ప్రపంచ నలుమూలల తెలియజేసిన గొప్ప మహనీయుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. కూడు, నీడ, గుడ్డ అనే నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి, బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా స్ఫూర్తిని కలిగించారన్నారు. తాను ప్రవేశపెట్టిన పథకాలు ఎన్నో ప్రజలకు అందించడం జరిగిందని, అలాగే పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేయడం, స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించడం, రెవెన్యూ డివిజనాలను ఏర్పాటు చేయడం, చేనేత కార్మికులకు సబ్సిడీ కరెంటును అందించడం, పేద ప్రజలకు రెండు రూపాయలకే కిలో బియ్యం అందించిన ఘనత నందమూరి తారక రామారావుకే దక్కిందన్నారు. ఆయన చేసిన పనులను స్మరిస్తూ ఈరోజు ఆయన 101వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, రానున్న రోజుల్లో ఆయన చూపిన బాటలో నడుస్తూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికై పాటుపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మచ్చ ఆంజనేయులు, టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి, నక్క రాజయ్య, చేట్కూరి నారాయణ గౌడ్, కడారి రాంరెడ్డి, బింగి వెంకటేశం, లక్ష్మణ్, దత్త్రాద్రి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

# ప్రజలను చైతన్యవంతులను చేయడంలో సురవరం పాత్ర అమోఘం : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మహబూబ్‌నగర్, మే 28 : తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో సురవరం ప్రతాపరెడ్డి అందించిన సేవలు అమోఘమని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఆయన విగ్రహానికి సురవరం ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులు సురవరం కపిల్, నివేదితతో కలిసి నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం ఒక వర్గానికి, ప్రాంతానికి పరిమితమైన వారు కాదని అన్నారు. ఆయన జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ లో కవులే లేరని చెప్పిన రోజున 350 మందికి పైగా కవులతో గోల్కొండ కవుల సంచికను ప్రచురించి విమర్శకులకు గట్టి సమాధానం ఇచ్చారని అన్నారు.

తెలంగాణ సాహిత్యానికి జాతీయ స్థాయిలో సురవరం గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సమితి డైరెక్టర్ మల్లు నర్సింహా రెడ్డి, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, కౌన్సిలర్లు గణేష్, అనంత రెడ్డి, పటేల్ ప్రవీణ్, రామలక్ష్మణ్ , సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను విక్రయిస్తున్న ముఠా అరెస్టు.. 16 మంది చిన్నారులను కాపాడిన రాచకొండ పోలీసులు

హైదరాబాద్, మే 28 :చిన్నారులను విక్రయిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ముఠా నుంచి 16 మంది చిన్నారులను కాపాడారు. వీరిలో కొందరు ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు ఉన్నట్టు గుర్తించారు పోలీసులు. ఇటీవల మేడిపల్లిలో చిన్నారి విక్రయంతో ఈ ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

నాలుగు రోజుల క్రితం పీర్జాదిగూడలో రూ. 4.50 లక్షలకు ఆర్ఎంపీ డాక్టర్ శోభారాణి శిశువును విక్రయించారు. ఆమెకు సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయడంతో ముఠా గుట్టురట్టయింది. మొత్తం 16 మంది ఈ చిన్నారులను విక్రయించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ సందర్భంగా కేసు వివరాలను రాచకొండ సీపీ తరుణ్ జోషీ మంగళవారం మీడియాకు వెల్లడించారు.పిల్లల విక్రయ ముఠా రాకెట్‌తో సంబంధం ఉన్న ఏజెంట్లు, సబ్ ఏజెంట్లు మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల మేడిపల్లిలో శోభారాణి, సలీం, స్వప్నలను అరెస్టు చేశాం. వారిని అరెస్టు చేసిన సమయంలో ఇద్దరు చిన్నారులను రక్షించాం. సంతానం లేని వారికి పిల్లలను విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు స్పష్టం చేశారు.ఢిల్లీ, పుణె నుంచి చిన్నారులను తీసుకొచ్చి అమ్ముతున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు సీపీ.

# హనుమంతుడి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
## -హనుమాన్ శోభ యాత్రలో ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, మే 28 : :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో హనుమాన్ పెద్ద జయంతిని పునస్కరించుకొని హనుమాన్ సేవ సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ నగరేశ్వర స్వామి వారి దేవాలయం నుండీ నిర్వహించిన హనుమాన్ శోభ యాత్రలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉంటూ సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలని వేడుకున్నారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, నాయకులు సంఘ స్వామి యాదవ్, చిలుక రమేష్, కనికరపు రాకేష్, నామాల లక్ష్మీరాజు, పుల్కం రాజు, దాడి మల్లేశం, హనుమాన్ భక్తులు తదితరులు ఉన్నారు.

# గ్రామాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## -బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర




కరీంనగర్, మే 27 : (నేటినిజం ప్రతినిధి) గ్రామాలు, పల్లెలు నేడు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని, గ్రామ పాలన సమస్యల వలయంలో చిక్కుకుందని, నిధుల లేమితో గ్రామపంచాయతీలు ఉత్సవ విగ్రహాల్లా మారాయని, గ్రామల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసి చోద్యం చూస్తుండడంతో గ్రామాలు, పల్లెలు నేడు కన్నీరు పెడుతున్నాయని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. మంగళవారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి, నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏమీ లేదని, గతంలో గ్రామాలకు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం రాష్ట్రం ఇతర అవసరాలకు మళ్లించి పంచాయతీ గల్లా పెట్టెను ఖాళీ చేసిందన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితి ఉందని , నిధుల కొరతతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. గ్రామపంచాయతీల్లో చేసిన పనులకు బిల్లు పోవడంతో గత సర్పంచులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, సర్పంచుల బాధలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రధానంగా గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేని దౌర్భాగ్య స్థితిలోకొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ముఖ్యగా నిధుల కొరతతో పల్లె పాలన అస్తవ్యస్తంగా మారిందని, గ్రామాల్లోని కాల్వల్లో మురుగు తీయాలన్నా, బ్లీచింగ్ జల్లాలన్న , చెత్త నిలువలు తొలగించాలన్న, ఫాగింగ్ చేయాలన్న గ్రామపంచాయతీ ఖాతాల్లో నిధులు లేవని, కొన్ని గ్రామాల్లో వీధి దీపాలు సైతం మరమత్తులు చేయించుకోలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. విద్యుత్ బకాయిలు, తాత్కాలిక ఉద్యోగులు, హరిత హర మొక్కల సంరక్షణ, ట్రాక్టర్ కిత్తిలు ప్రస్తుతం గ్రామపంచాయతీలకు గుదిబందల మారాయన్నారు. అనేక గ్రామపంచాయతీలో పనిచేసే సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో చాలాచోట్ల విధులు సక్రమంగా జరగలేదన్నారు. తిధుల కొరతతో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం పంచాయతీల్లో అత్యవసరమైన పనులు చేయడానికి కూడా చెల్లి గవ్వ లేని పరిస్థితులు వచ్చాయని, దీంతో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయన్నారు. కనీస మౌలిక వసతులకు కూడా పల్లెలు నోచుకోలేని పరిస్థితులు వచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేసిన పనులకు నేటికీ సర్పంచులకు బిల్లులు రాక అయోమయ పరిస్థితిలో ఉన్నారని, బిల్లుల కోసం తిరిగిన నేడు ఫలితం లేకుండా పోయిందన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం 14,15వ ఆర్థికసంఘం కింద విడుదలైన నిధులు, ఈజీఎస్ నిధులు ఏమయ్యాయని గత సర్పంచులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామపంచాయతీల, గత సర్పంచుల సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. బిల్లులు వస్తాయో రావో అనే నిరాశ నిస్పృహాలో సర్పంచులంతా ఉన్నారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం గ్రామాలకు, లోగడ పనిచేసిన సర్పంచుల బిల్లుల విషయంపై భరోసా కల్పించే ప్రయత్నం కూడా చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి పల్లెలు గ్రామాల అభివృద్ధి పై, సమస్యల పై నేటికీ దృష్టి సారించకపోవడం తో గ్రామాల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రేవంత్ ప్రభుత్వం గ్రామాల సమస్యలను పరిష్కరించకుండా , స్పెషల్ ఆఫీసర్ల చేతుల్లో పెట్టి చేతులు దులుపుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పల్లెలు, గ్రామాల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై తక్షణం చర్యలు చేపట్టాలని, అలాగే సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు అందించి ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# మిల్క్‌షేక్‌ల కోసం రిటార్ట్ అల్యూమినియం క్యాన్‌లను పరిచయం చేసిన బాల్ కార్పొరేషన్, కావిన్‌కేర్




హైదరాబాద్, మే 28 : మిల్క్‌షేక్‌ల ప్యాకేజింగ్ కోసం ప్యాకేజింగ్‌లో గ్లోబల్ లీడర్ బాల్ కార్పొరేషన్, పాడి పరిశ్రమలో అగ్రగామి కావిన్‌కేర్ చేతులు కలిపాయి.

ఈ భాగస్వామ్యంతో ప్రసిద్ధ మిల్క్‌షేక్‌ల కోసం రిటార్ట్ టూ-పీస్ అల్యూమినియం క్యాన్‌లను పరిచయం చేస్తున్నారు. దీంతో డెయిరీ ప్యాకేజింగ్‌లో విప్లవాత్మక మార్పులకు పునాది వేసినట్టే. ఈ సందర్భంగా బాల్ బెవరేజ్ ప్యాకేజింగ్ (ఆసియా) కమర్షియల్ డైరెక్టర్ మనీష్ జోషి మాట్లాడుతూ డైరీ ఉత్పత్తులు భారతదేశంలో అంతర్భాగంగా ఉన్నాయన్నారు. 2028 నాటికి 4.1 శాతం సీఏజీఆర్ పెరుగుతాయని అంచనా ఉందన్నారు. మా దృష్టి అంతా సిద్ధంగా ఉన్న డ్రింక్ విభాగంపైనే ఉందనీ తెలిపారు. ఇది ప్రత్యేకమైన ఫ్లేవర్స్, ఆఫర్స్ తో వేగంగా వృద్ధి చెందుతుందన్నారు. డెయిరీ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పెట్టుబడి పెట్టామన్నారు. ఈ పెట్టుబడితో మరింత వేగంగా విస్తరించనుందన్నారు. అల్యూమినియం క్యాన్‌లలో అనేక రకాల పాల ఉత్పత్తులను ప్యాక్ చేయడానికి అవకాశం ఉందన్నారు. ఈ ప్యాకేజింగ్ పాల ఉత్పత్తుల రుచి, పోషకాలు, తాజాదనాన్ని కాపాడతాయని పేర్కొన్నారు.

ఈ డబ్బాలు వినియోగదారుల జీవనశైలికి సరిగ్గా సరిపోతాయని తెలిపారు.

ఈ సందర్భంగా కావిన్‌కేర్ బెవరేజెస్ విభాగం బిజినెస్ హెడ్ మల్లికేశ్వరన్ కేజీ మాట్లాడుతూ ఈ వ్యూహాత్మక సహకారం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు.

అల్యూమినియం క్యాన్‌ల వైపు మా ప్రయాణం అత్యుత్తమ, నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో మా నిబద్ధతను తెలియజేస్తుందని తెలిపారు.

ఈ ప్యాకేజింగ్‌లో విభిన్నమైన మిల్క్‌షేక్ రుచులు అయిన బాదం, గుల్‌ఖండ్, రాజ్‌బోగ్, రబ్రీలను అందిస్తున్నామని తెలిపారు. టూ-పీస్ అల్యూమినియం డబ్బాలు ప్యాకేజింగ్ అప్లికేషన్‌లకు అత్యంత ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. తేలికగా ఉండటంతో రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ డబ్బాలు కాంతి, ఆక్సిజన్ నుంచి రక్షణ ఇస్తాయన్నారు.


తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్
ఆహ్వానం



మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక
బాల సాహిత్య సమ్మేళనం
2024 మే 29, 30 తేదీల్లో



వేదిక : డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం
తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణం
తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్

మొదటి సదస్సు
మధ్యాహ్నం 2 గంటలకు
'బడిలో తెలుగు భాష' చర్చా గోష్ఠి
విశిష్ట అతిథి
డా. దాసరి వెంకట రమణ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
అధ్యక్షులు
డా. వి.ఆర్. శర్మ ప్రముఖ బాలసాహితీవేత్త
పాల్గొనే ప్రముఖులు
శ్రీ బద్రి కూర్మారావు, డా. చిట్యాల దేవేంద్రప్ప, శ్రీ పుల్లా రామాంజనేయులు, డా. శారదా హన్మాండ్లు, డా. తూర్పింటి నరేష్ కుమార్, శ్రీమతి బాలబోయిన రమాదేవి, శ్రీ కూకట్ల తిరుపతి, శ్రీ గోపగాని రవీందర్, శ్రీమతి త్రిపురారి పద్మ, శ్రీమతి జి. శ్రీమతి, శ్రీ శీలం భద్రయ్య, శ్రీ గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ, శ్రీ సయ్యద్ షఫీ, శ్రీ చక్రవర్తుల శ్రీనివాస్, శ్రీ అక్షరం ప్రభాకర్, శ్రీ అరుణ బట్టువార్, శ్రీ కొండూరు పోతన
సమన్వయ కర్త : డా. ఉప్పల పద్మ అధ్యాపకులు,రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి

సాయంత్రం 4 గంటలకు
రెండవ సదస్సు
"పత్రికలు - బాలసాహిత్యం' చర్చా గోష్ఠి
అధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు 'నేటి నిజం' సంపాదకులు
విశిష్ట అతిథి : శ్రీ మణికొండ వేదకుమార్ 'బాల చెలిమి' సంపాదకులు
పాల్గొనే బాలల పత్రిక సంపాదకులు, పత్రికా రచయితలు
శ్రీ టి. వేదాంత సూరి (మొలక), శ్రీ యన్.కె. బాబు (నాని), శ్రీ రాజా (చెకుముకి), శ్రీ ప్రభాకర్ (చంపక్), డా. బి. మనోహరి (మూసి), శ్రీ పొత్తూరి సుబ్బారావు (సాహితీ కిరణం), డా. నెమిలేటి కిట్టన్న (బాలల నేస్తం), శ్రీమతి రత్నమాధవి (గడుగ్గాయి), శ్రీ కంతేటి చంద్రప్రతాప్
సమన్వయకర్త : శ్రీ కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి ప్రముఖ బాలసాహితీవేత్త

సాయంత్రం 6 గంటలకు
మూడవ సదస్సు
'కథ చెప్పే కళ'
అధ్యక్షులు
శ్రీ చొక్కాపు వెంకటరమణ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
విశిష్ట అతిథి
శ్రీమతి కన్నెగంటి అనసూయ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
పాల్గొనే కథకులు
డా. ఎం. హరికిషన్, శ్రీ ఎన్నవెళ్ళి రాజమౌళి, శ్రీ వంగపల్లి పద్మ, శ్రీమతి మనోజ, శ్రీమతి దివ్య, శ్రీమతి ఎ. ప్రమీల, శ్రీమతి సమ్మెట ఉమాదేవి, శ్రీ టి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, శ్రీమతి కృష్ణ చైతన్య
సమన్వయ కర్త :శ్రీమతి రమాదేవి కులకర్ణి ప్రముఖ కవయిత్రి

30వ తేది ఉదయం 10గంటకు
నాల్గవ సదస్సు
"లలిత కళా పరిచయం"
అధ్యక్షులు : శాంతా రావు బాల వికాసకారులు
విశిష్ట అతిథి : డా. జి. అమృతలత విద్యావేత్త, ప్రముఖ రచయిత్రి
ప్రసంగాంశాలు - వక్తలు
సంగీతం - శ్రీమతి మాడభూషిణి రాజ్యలక్ష్మి సంగీత విద్వాంసురాలు
నృత్యం - కోకా విజయలక్ష్మి ప్రముఖ నర్తకి, నాట్యగురువు
నాటకం - శ్రీ బీచరాజు శ్రీధర్ ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు
చిత్రలేఖన శిల్పకళ - శ్రీ జె. వెంకటేశ్వర్లు (జెవి) ప్రముఖ చిత్రకారులు, జెఎన్టీయూ అధ్యాపకులు
జానపద కళలు - శ్రీ గజవెల్లి ఈశ్వర్ తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల అధ్యాపకులు
సమన్వయకర్త : శ్రీ కోకిల నాగరాజు అధ్యాపకులు, కళాకారులు

మధ్యాహ్నం 12 గంటలకు
ఐదవ సదస్సు
"బాల సాహిత్యం - ప్రమాణాలు"
అధ్యక్షులు : శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి ప్రముఖ బాలసాహితీవేత్త
విశిష్ట అతిథి: శ్రీమతి మాడభూషి లలితా దేవి కన్వీనర్, మాడభూషి రంగాచార్య స్మారకట్రస్టు
పాల్గొనే బాలసాహితీవేత్తలు
శ్రీ టి.వి. రామకృష్ణ, డా. గంగిశెట్టి శివకుమార్, డా. కందేపి రాణి ప్రసాద్, డా. సిరి, డా. సాగర్ల సత్తయ్య, శ్రీ ఉండ్రాళ్ళ రాజేశం, శ్రీ పుప్పాల కృష్ణమూర్తి, డా. బి.వి.ఎన్. స్వామి, శ్రీ పైడిమర్రి రామకృష్ణ, శ్రీ మాచిరాజు కామేశ్వరరావు, శ్రీ ఆర్.సి. కృష్ణస్వామి, శ్రీ కొత్తపల్లి సురేశ్
సమన్వయకర్త : డా. అమరవాది నీరజ బాల సాహితీవేత్త
భోజన విరామం

ఆరో సదస్సు
మధ్యాహ్నం 2.30 గంటలకు
"బాల సాహిత్యం - గ్రంథాలయాలు"
అధ్యక్షులు : శ్రీ సి.ఎ. ప్రసాద్ బాల సాహితీవేత్త
విశిష్ట అతిథి : శ్రీ శీల అవిలేను స్వచ్ఛంద గ్రంథాలయ నిర్వాహకులు
పాల్గొనే బాల సాహితీవేత్తలు, గ్రంథాలయ నిర్వాహకులు
డా. వాసరవేణి పర్శరాములు, శ్రీ డి. ప్రవీణ్ శర్మ, శ్రీ కందుకూరి భాస్కర్, శ్రీ రాచర్ల రమేష్, శ్రీ ఎస్. వెంకటనారాయణ, శ్రీమతి సబ్బని సుమిత్రాదేవి, శ్రీ కిలపర్తి దాలినాయుడు, శ్రీ కూచిమంచి నాగేంద్ర, శ్రీ పోరెడ్డి అశోక్, శ్రీ మెందు మహేశ్వర్, శ్రీమతి గద్వాల కిరణ్ కుమారి, శ్రీ దుర్గం బైతి
సమన్వయం : డా. కాసర్ల నరేష్ రావు బాల సాహితీవేత్త, రచయిత
5 / 7

సాయంత్రం 4.30 గంటలకు
సమాపనోత్సవం
అధ్యక్షులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు
ముఖ్య అతిథి
శ్రీమతి ఎం. రాధారెడ్డి
డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్.సి.ఈ.ఆర్.టి.)
విశిష్ట అతిథి
శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి
సంయుక్త సంచాలకులు, మోడల్ స్కూల్స్, తెలంగాణ ప్రభుత్వం
గౌరవ అతిథి
డా. పత్తిపాక మోహన్
దక్షిణప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం
ఈ కార్యక్రమానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.
డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com